క్లుప్తంగా

లక్ష్యాలు పూర్తిచేయాలి



ఇళ్ల స్థలాల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ అన్నామణి

కరప: గ్రామ పంచాయతీలకు నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేయాలని డీఎల్‌పీఓ టి.అన్నామణి ఆదేశించారు. మండల పర్యటనలో భాగంగా మంగళవారం ఆమె స్థానిక గ్రామ పంచాయతీలో కార్యదర్శి, గ్రామ సచివాలయం, సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించి, నూరు శాతం పూర్తి చేయాలన్నారు. గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపొందించాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి, ఎక్కువ మంది లబ్ధిపొందేలా ప్రచారం చేయాలన్నారు. తర్వాత నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇంటి స్థలం పట్టాలను సకాలంలో రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. గ్రామ సచివాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి, డీఎల్‌పీఓ అన్నామణి సంతృప్తి వ్యక్తంచేశారు. గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్ర కుమార్, వీఆర్వో ఏవీ రామకృష్ణారెడ్డి, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



లఘు నాటికను ప్రదర్శిస్తున్న స్వీప్ సభ్యులు

కాకినాడ: రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా ఏపీఎస్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం(స్వీప్), ఓటర్ల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి గణేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్వీప్ సభ్యులు లఘు నాటికలు ప్రదర్శన ద్వారా ఓటు హక్కు విలువను తెలియజేసి అనంతరం అవగాహన ర్యాలీని చేపట్టారు.

పండూరు పీహెచ్‌సీ తనిఖీ



సిబ్బంది హాజరుపట్టీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

కాకినాడ రూరల్: మండలంలోని పండూరు పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో నరసింహనాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాల్లో పరిశుభ్రతను పరిశీలించి సాయంత్రం ఎదురుగా ఉన్న సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ చూసి హాజరును పరిశీలించారు. ఆస్పత్రిలో ఓపీ, ఇతర సేవలపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

స్నేహితుడి కుమార్తెపై లైంగిక దాడి

కాకినాడ క్రైం: ఓ కామాంధుడు స్నేహితుడి కుమార్తెపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. కాకినాడ ఏసువారి వీధిలో నివాసం ఉంటున్న 28 ఏళ్ల తిల్లపూడి లోకేష్ ఓ లారీ డ్రైవర్. నగరంలో హెచ్‌పీ గ్యాస్ కంపెనీ సమీపంలో నివసిస్తున్న అతడి స్నేహితుడైన మరో లారీ డ్రైవర్ ఇంటికి తరచుగా వెళ్తుంటాడు. ఆయనకు భార్య ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. సోమవారం సాయంత్రం లోకేష్ స్నేహితుడిని కలిసేందుకు అతడి ఇంటికి వెళ్లాడు. అప్పటికే ఆ డ్రైవర్ లారీపై కిరాయికి వెళ్లాడు. అతడి భార్య మార్కెట్‌కు వెళ్లింది. ఈ సమయంలో తొమ్మిదేళ్ల కుమార్తె ఇంట్లో ఒంటరిగా ఉంది. ఆమెను గదిలోకి తీసుకెళ్లి లోకేష్ అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని బాలిక మార్కెట్ నుంచి ఇంటికి వచ్చిన తల్లికి చెప్పింది. తల్లి వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం నిందితుడిని అరెస్టు చేశారు.

ఏపీ జేఏసీ ధర్నా

కాకినాడ సిటీ: ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి ఏపీ జేఏసీ పిలుపు మేరకు మంగళవారం కాకినాడ ధర్నా చౌక్‌లో జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. జిల్లా ఏపీ జేఏసీ చైర్మన్ గుద్దడి రామమోహన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్లు సత్వరం పరిష్కరించాలని కోరారు. నాయకులు పేపకాయల వెంకటకృష్ణ, పసుపులేటి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో చురుగ్గా అభివృద్ధి పనులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర ఆలయంలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. ఎంపీ వంగా గీత విడుదల చేసిన నిధులతో ఆలయంలోని వ్యర్థాలతో కూడిన నీటిని పొలాలకు మళ్లించే డ్రైన్ నిర్మాణ పనులు ప్రారంభించినట్టు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. మహాశివరాత్రి అనంతరం భక్తులు నడిచి వెళ్లే మార్గాన్ని తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు.



యండమూరులో స్వామివారికి గరుడోత్సవం





ప్రత్యేక అలంకరణలో కాకినాడ మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి, కరపలోని వేణుగోపాలస్వామి

వైభవంగా భీష్మ ఏకాదశి ఉత్సవాలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు, పారాయణలు చేసిన భక్తులు

బోట్‌క్లబ్: భీష్మ ఏకాదశి సందర్భంగా నగరంలోని వైష్ణవాలయాలు మంగళవారం గోవింద నామస్మరణతో మార్మోగాయి. స్వామి వార్లకు పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, ద్రవిడ ప్రబంధ పారాయణ జరిపారు. అనంతరం గ్రామోత్సవాలు నిర్వహించారు. తెల్లవారుజామున నుంచి ఆలయాల వద్ద భక్తులు దర్శనం కోసం క్యూ కట్టారు. స్వామి వారిని వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. గాంధీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఈవో శ్రీనివాస్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, దేవాలయం వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో, వెంకట్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, మెహర్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు.

కరప మండలంలో..

కరప: మండల పరిధిలోని భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరప, జెడ్.భావారం, పెనుగుదురు, కూరాడ, చినమామిడాడ, యండమూరు, కొంగోడు గ్రామాల్లోని విష్ణాలయాల్లో, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రామాలయాల్లో భజన బృందాలతో ఏకాహం నిర్వహించారు. కరప విష్ణాలయంలో అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ పూజలు చేశారు. కరప కొత్తపేట రామాలయ కమిటీ ప్రతి ఇంటిగోడలపైన ఓం శ్రీరామ అని రాయించి శ్రీరామ ప్రచారం నిర్వహించారు. కరప కొత్తపేట రామాలయంలో శ్రీరామ సప్తాహం జరిగింది.



యండమూరులోని మీసాల వెంకటేశ్వరస్వామి

వేడుకగా వెంకటేశ్వరుని దివ్యకళ్యాణం

మండలం యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామివారి దివ్య కల్యాణం మంగళవారం వైఖానస మహదాచార్య చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణవేడుకలు నిర్వహించారు. వంశపారంపర్య అర్చకుడు పెద్దింటి సీతారామం ఆధ్వర్యంలో ధ్వజారోహణం, గరుడోత్సవం నిర్వహించారు. దేవదాయశాఖ ఈఓ పీవీఎస్ సూర్యనారాయణరాజు, కె.రఘు కళ్యాణోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాకినాడ నుంచి జింకల తరలింపు

కాకినాడ రూరల్: నాగార్జున ఫెర్టిలైజర్ అండ్ కెమికల్స్ ఫ్యాక్టరీ కాకినాడ జింకల పార్కు నుంచి నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌కు 37 జింకలను తరలిస్తున్నట్టు కోరంగి వన్య ప్రాణి విభాగం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ మంగళవారం తెలియజేశారు. సెంట్రల్ జూ అథారిటీ ఆఫ్ ఇండియా (సీజెడ్ఏ) అనుమతితో కొనసాగుతున్న కాకినాడ జింకల పార్కులో సుమారు 200 జింకలు ఉండేవన్నారు. ఫ్యాక్టరీ నిర్వహణ, నిధులు లేమి వల్ల సీజెడ్ఏ అనుమతిని రద్దు చేయడంతో ప్రస్తుతం అక్కడి 200 జింకలను నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్‌కు తరలించాల్సి వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ అనుమతితో జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి ఆధ్వర్యంలో నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ పశువైద్యాధికారి అరుణ్ వెస్లీ, తిరుపతి వెంకటేశ్వర జూ పార్కు, విశాఖపట్నం ఇందిరా ప్రియదర్శిని జూ పార్కు పశు వైద్య బృందం ఈ నెల 16న బొమా టెక్నిక్ ద్వారా వీటిని తరలించామన్నారు. వన్యప్రాణులపై ఏ విధమైన ఒత్తిడి లేకుండా తొలి విడతలో 37 జింకలను తరలించి టైగర్ రిజర్వ్‌లో విడిచిపెట్టామన్నారు.



కాకినాడ నాగార్జున ఫెర్టిలైజర్ అండ్ కెమికల్స్ ఫ్యాక్టరీ జింకల పార్కులోని జింకలు

టౌన్‌హాల్ అభివృద్ధి పనులు ప్రారంభం

బోట్‌క్లబ్: టౌన్‌హాల్ లిటరరీ అసోసియేషన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అదనపు భవనాలను పైడా వంశీయులు వెంకటేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. టౌన్‌హాల్ కమిటీ అధ్యక్షులు జీవీఎస్ఎన్ మూర్తి (నానాజీ) పైడా వంశీయులందరికీ స్వాగతం పలికారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు ప్రత్యేక ఆంధ్రా కోసం పైడా వంశీయులు ఎంతో కృషి చేశారన్నారు. ఇదే టౌన్‌హాల్ ప్రాంగణానికి గాంధీ మహాత్ముడు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అధ్యక్షుడు నానాజీ మాట్లాడుతూ ఈ అదనపు సదుపాయాల కల్పనతో ఈ ప్రాంగణంలో జరిగే జాతీయ క్రీడా, ఇతర పోటీలకు క్రీడాకారులకు అవసరమైన వసతి సమస్య పరిష్కారమైందన్నారు. విద్య, వైద్య, క్రీడా ఇలా అన్ని రంగాలకు టౌన్‌హాల్ ఆతిథ్యమిస్తూ వాటి అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కార్యదర్శి పాటోలు చిన్నపున్నయ్య మాట్లాడుతూ లిటరరీ అసోసియేషన్ 1877లో స్థాపించారని, ఆనాటి నుంచి నేటి వరకు వారి ఆశయాలతో కమిటీలు బాధ్యతలు నిర్వహిస్తూ వస్తున్నాయన్నారు. ఈ నెల 25న క్లబ్ 147వ వ్యవస్థాపక దినోత్సవ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు జీవై రఘునాథ్, సంయుక్త కార్యదర్శి వీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కోశాధికారి ఎం.సూర్యనారాయణరాజు, కార్యవర్గ సభ్యులు, కర్రి భామిరెడ్డి, బసవాప్రసాద్, పి.రామచంద్రరాజు పాల్గొన్నారు.



టౌన్‌హాల్‌లో అదనపు భవనాలను ప్రారంభిస్తున్న పైడా వేంకటేశ్వరరావు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కరప: బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని, ఇదే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి, బాల్య వివాహాలు అరికట్టాలని ఐసీడీఎస్ సీడీపీఓ వై.లక్ష్మి పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం వీఓలు, వీఏలు, అంగన్‌వాడీలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలికలు వేధింపులకు గురైతే వారి లక్షణాలు ఎలాఉంటాయి, వారిని ఎలా గుర్తించాలో వివరించారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసే వారికి రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష విధిస్తారన్నారు. ఈ విషయమై సమాచారం ఇవ్వాలంటే చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నంబరు 1098కి ఫోన్‌చేసి, సమాచారం అందించాలన్నారు. పిల్లలులేని తల్లిదండ్రులు పిల్లలను దత్తత తీసుకోవాలనుకుంటే స్త్రీ, శిశు సంక్షేమశాఖ ద్వారా నిర్వహిస్తున్న శిశు గృహాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మేడిశెట్టి గనికలక్ష్మి, డీఆర్‌డీఏ ఏపీఎం ఎంఎస్‌బీ దేవి, ఓఆర్‌డబ్ల్యూ ఎస్.చిన్నబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



కరపలో బాల్య వివాహాల నిర్మూలనపై మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మి

ఖోఖో క్రీడాకారులకు కన్నబాబు అభినందన



క్రీడాకారిణులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో ఖోఖోలో సత్తా చాటిన విద్యార్థులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అభినందించారు. 3వ డివిజన్ మాజీ కార్పొరేటరు వడ్డి మణికుమార్ ఆధ్వర్యంలో గుడారిగుంట పాఠశాలకు చెందిన క్రీడాకారిణిలు తమ సాధించిన కప్‌ను తీసుకుని వైద్యనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబును కలిశారు. ఈ సందర్భంగా నియోజవర్గాన్ని రాష్ట్ర స్థాయిలో నిలిపి కప్‌తో పాటు రూ.2 లక్షలు నగదు బహుమతి అందుకున్న విద్యార్థినులు అభినందనీయులన్నారు. రాష్ట్ర, దేశం తరపున క్రీడల్లో పాల్గొనే అవకాశం పొందాలని, ఉన్నత స్థితికి రావాలని కోరారు. అలాగే స్పోర్ట్స్ కోటలో మంచి ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యారాయణ, హెచ్ఎం వై.శ్రీనివాస్, కోచ్ వాసు, వైఎస్సార్ సీపీ నాయకులు నేరేళ్ల, భువనేశ్వరి, కృప, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకుడు సత్యలింగం నాయకర్

కాకినాడ సిటీ: స్థానిక జగన్నాథపురంలోని ఎంఎస్ఎన్ చారిటీస్ వ్యవస్థాపకుడు, మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ 109వ వర్ధంతి సందర్భంగా మంగళవారం వంశ పారంపర్య ధర్మకర్త మల్లాడి కార్తీక్ నాయకర్ పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రతి పేద విద్యార్థికి విద్యను అందించాలనే దృక్పథంతో ఎంతో మంది పేద విద్యార్థులకు ఉపయోగ పడేలా విద్యను అందించేందుకు వివిధ సంస్థలను ఏర్పాటు చేసిన నాయకర్ చరిత్రలో మార్గదర్శిగా నిలిచిపోయారన్నారు. విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు నృత్య ప్రదర్శనలు, సాంప్రదాయ నాట్యాలు ప్రేక్షకులను అలరించాయి. జానపద నృత్య ప్రదర్శనలు, కూచిపూడి సంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎన్ చారిటీస్ కార్యనిర్వహణాధికారి, కరస్పాండెంట్ ఆర్‌వి చందన, పూర్వ ధర్మకర్తల మండలి సభ్యులు పొన్నమండ విజయకుమార్, ప్రిన్సిపాల్స్ కె.అమరేశ్వరరావు, టి.రాజశేఖర్, సుబ్రహ్మణ్యం, బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, సాయికృష్ణ, వంశీ, గంగాధరరావు, చంద్రమౌళి, అవధాని తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.



విద్యార్థులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మత్స్యకారులను వివాదాల్లోకి లాగొద్దు

- రాజకీయ లబ్ధి కోసం వారి ప్రయోజనాలు పణంగా పెట్టొద్దు
- మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వాసుపల్లి

కాకినాడ: రాజకీయ లబ్ధి కోసం మత్స్యకార జాతిని అనవసర వివాదాల్లోకి లాగొద్దని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, మత్స్యకార నాయకులు వాసుపల్లి కృష్ణ కోరారు. మంగళవారం సాయంత్రం దుమ్ములపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తప్పుడు ఆరోపణలు చేస్తున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కుటుంబాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే ద్వారంపూడి చేసిన విమర్శల అంతరార్థాన్ని గ్రహించి మాట్లాడాలని, కొండబాబు ముస్లిం సోదరులతో వివాదాల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి, ముస్లిం సోదరులను చంపుతామని బెదిరించే స్థాయికి...



మ్ముల్లా కలిసిమెలసి ఉండే మత్స్యకారుల అమాయకత్వాన్ని సాటి మత్స్యకార రాజకీయ ప్రతినిధులే ఆసరాగా తీసుకుని చీప్ ట్రిక్స్‌కు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఒకప్పుడు అధికారంలో ఉండగా దుమ్ములపేట ప్రాంతాన్ని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు దత్తత తీసుకుని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి అధికారంలోకి వచ్చాక సుమారు రూ.10.50 కోట్లు ఖర్చు చేసి దుమ్ములపేటను అభివృద్ధిని చేశారన్నారు. మరో రెండు కోట్లతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కూడా నిర్మించారన్నారు. అటువంటి ద్వారంపూడి మత్స్యకార జాతిని కించపరిచారచాల్సిన అవసరం ఏముంటుందని, తప్పుడు ఆరోపణలతో మత్స్యకార జాతి పరువు ప్రతిష్టలు తీయవద్దని హితవు పలికారు. మత్స్యకార ప్రతినిధులు వాసుపల్లి రాంబాబు, ఎరుపల్లి సీతారామ్, పేర్ల దుర్గారావు, సిరిబి జగన్నాథం తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలే విజయానికి బాటలు



ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన వాకలపూడి గౌడ సంఘం సభ్యులు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు

కాకినాడ రూరల్: సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి బాటలు వేస్తాయని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని కాకినాడ రూరల్, కరప మండలాల నుంచి మంగళవారం కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి నాయకులు, కార్యకర్తలు భారీగా చేరారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘానికి చెందిన 100 మంది సభ్యులు చేరారు. వీరిలో కోట ఉమ అచ్యుతరమణ, పైన గణేష్, వాడపల్లి మునలయ్య, పొన్నాడ సత్యనారాయణ తదితరులు ఉన్నారు. వాకలపూడి గ్రామానికి చెందిన గౌడ సంఘం నాయకులు సైతం ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. సూర్యారావుపేట మాజీ సర్పంచ్ కోమలి సత్యనారాయణ, గౌడ సంఘ నాయకులు గణేశ్వరరావు, వెంకటేశ్వరరావు, రాజు, చిన్న, వెంకటరమణ, రాము, దుర్గాప్రసాద్ తదితరుల ఆధ్వర్యంలో 100 మంది పార్టీలో చేరారు.



వైఎస్సార్ సీపీలో నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

అలాగే కరప మండలం కొంగోడు గ్రామానికి చెందిన నాయకులు పార్టీలో భారీగా చేరారు. వీరందరికీ వైఎస్సార్ సీపీ పార్టీ కండువాలను వేసి ఎమ్మెల్యే కన్నబాబు సాదరంగా ఆహ్వానించారు. కన్నబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 1600 కోట్ల మేర సంక్షేమ పథకాలను ప్రజలు లబ్ధి పొందారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని, నియోజకవర్గంలో అత్యధికంగా నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రతి సామాజిక వర్గానికి సామాజిక భవనాలు నిర్మించామన్నారు.

కన్నబాబును అధిక మెజారిటీతో గెలిపిస్తాం

ఎంపీపీ గోపిశెట్టి పద్మజ

కాకినాడ రూరల్: ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని, మహిళలందరూ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టబోతున్నారని రూరల్ ఎంపీపీ గోపిశెట్టి పద్మజ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఆమె అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశం అనంతరం మహిళా ప్రజాప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. పద్మజ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజకపాలన అందించారన్నారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా 31 లక్షల మంది ఆడపడుచుల పేరిట సొంతింటి కల సాకారం అయ్యేలా విలువైన స్థలాలు అందించారన్నారు. విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ సంక్షేమ బాటలు పటించడంతో ప్రజలు వైఎస్సార్ సీపీపై సానుకూలంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మంచి నిబద్ధతతో పనిచేసే నాయకుడని, ఆయన మరోసారి విజయం సాధిస్తారని, ఇందుకు మహిళలతోపాటు అన్ని వర్గాల ప్రజలు సైనికుల్లా పనిచేస్తామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బందిలి విరీష, గంగనాపల్లి సర్పంచ్ గీసాల మహాలక్ష్మి, ఎంపీటీసీలు ఊబా నాగమణి, వాసంశెట్టి సత్యవేణి, కొండేపూడి లీలావతి తదితరులు పాల్గొన్నారు.



పాత్రికేయులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ పద్మజ, వైస్ ఎంపీపీ విరీష, సర్పంచ్ మహాలక్ష్మి

ఆయిల్ పామ్ సాగుకు మరింత సబ్సిడీ

జిల్లా ఉద్యాన శాఖాధికారి మల్లికార్జునరావు

పెద్దాపురం: ఆయిల్ పామ్ రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను వివరించాల్సిన అవసరం సిబ్బందిపై ఉందని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎస్.మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని ఆర్‌బీ పట్నం, సీబీ దేవం, కొండపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌బీ పట్నం సచివాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూరగాయలు, అరటి, దుంప తదితర ఆయిల్‌పామ్ పంటలు సాగు చేస్తున్న రైతులకు హెక్టారుకు రూ.5250 సబ్సిడీని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. రైతులు మరింత సాంకేతిక పరిజ్ఞానం సాధించేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. రోజుకు ఒక్కరికి రూ.500 చొప్పుల రెండు రోజులకు 30 మంది రైతులకు రూ.30 వేలు అందజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ సాగును పరిశీలించారు. మండల ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత, చిలకమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లేశ్వర స్వామివారి కల్యాణం

కరప: మండలం అరట్లకట్టలో అతి పురాతన భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి కళ్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు కొంతేటి సూర్యదత్త శివకుమార్ ఉదయం నుంచి పూజాదికాలు నిర్వహించారు. ఈ ఏడాది నూతనంగా నిర్మించిన రథంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. రాత్రి కల్యాణం నిర్వహించారు. దేవదాయశాఖ ఇన్‌చార్జి ఈఓ మోర్త మురళీవీరభద్రరావు, చీరట్ల శ్రీను గ్రామస్తులు స్వామి కల్యాణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అరట్లకట్ట పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామి కల్యాణాన్ని తిలకించి, తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి